క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమతా ఆస్పత్రి విద్యుత్ సెక్షన్ పరిధిలో లైన్ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని సెక్షన్ ఏఈ చావా లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నేతాజీనగర్, రాఘవయ్యనగర్, వరదయ్యనగర్, తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సన్మానం

ఖమ్మం మామిళ్లగూడెం: దసరా ఉత్సవాల్లో భాగంగా ఖమ్మం 25వ డివిజన్ రిక్కాబజార్‌లోని మాతా శ్రీఅంబాభవానీ ఆలయంలో ఖమ్మం నగర భావసార్ క్షత్రియ మండలి మందిర కమిటీ ఆధ్వర్యాన మంగళవారం రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు వడ్డెబోయిన నర్సింహారావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పూర్ణ, నాగిశెట్టి రాధాకృష్ణ, షేక్.ఖాజా, కందికొండ శ్రీను, గోజే శ్రీనివాసరావు, గుజ్జరు శ్రీనివాసరావు, రవికుమార్, భవానీలు, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: దసరా ఉత్సవాలలో భాగంగా వీరనారి మణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యాన ఖమ్మం బీకే బజారులో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే బహుజన బతుకమ్మ సంబరాలను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయి, గౌరవ అధ్యక్షురాలు షేక్ నజీమా కోరారు. మంగళవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో ఝాన్సీ, జ్యోతి, కల్పన, త్రివేణి, భవాని తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ గ్రామానికి చెందిన కె.నరేష్ (35) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈమేరు మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

'విన్‌ఫీల్డ్'కు సీబీఎస్ఈ అనుమతులు



అనుమతి పత్రంతో డైరెక్టర్లు

ఖమ్మంసహకారనగర్: విన్‌ఫీల్డ్ హైస్కూల్‌లో 2015–26 ఏడాది నుంచి సీబీఎస్ఈ బోధనకు అనుమతులు లభించాయని డైరెక్టర్లు గద్దె పుల్లారావు, మన్నే కిశోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ తెలిపారు. ఈమేరకు వారు మాట్లాడుతూ సీబీఎస్ఈ విధానంలో జాతీయస్థాయి విద్యా బోధనను అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు.

చిత్రాన్ని ఆదరించండి

కూసుమంచి: ఈనెల 18న విడుదల కాబోతున్న 1980 రాధేకృష్ణ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని చిత్ర నిర్మాత ఊడుగు సుధాకర్ కోరారు. మండలంలోని ముత్యాలగూడెం గ్రామానికి చెందిన ఆయన ఈ చిత్రాన్ని నిర్మించగా.. మంగళవారం ఖమ్మంలోని గాయత్రీ కళాశాలలో ప్రమోషన్ వర్క్‌లో భాగంగా విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించి మాట్లాడారు. చిత్ర దర్శకుడు ఇస్మాయిల్‌తో పాటు చిత్ర బృందం, కాంగ్రెస్ నాయకుడు పత్తికొండ శ్రీనివాసులు, కళాశాల యాజమాన్యం కిలారు కుటుంబరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత సమస్య రాకుండా చర్యలు

కామేపల్లి: ముందస్తు చర్యలతో గర్భిణులకు రక్తహీనత సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు అన్నారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీలో వైద్య, ఐసీడీఎస్, ఐకేపీ సిబ్బందికి రక్తహీనత సమస్యను అధిగమించేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి నెల్లూరి చందన, ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి తదితరులు పాల్గొన్నారు.

మంచుకొండ పీహెచ్‌సీలో విచారణ

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నడుమ వివాదం నెలకొన్న నేపథ్యాన మంగళవారం డీఎంహెచ్ఓ వరికూటి సుబ్బారావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ సైదులు విచారణ చేపట్టారు. వైద్యాధికారి రమేష్ అదనంగా పనిచేయిస్తున్నారని కొందరు సిబ్బంది ఫిర్యాదు చేయడంతో విచారించారు. వైద్యం కంటే ఆన్‌లైన్ డేటాకే ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆదివారం కూడా వాట్సాప్ పర్యవేక్షణ పెంచారని కొందరు సిబ్బంది వివరించినట్లు తెలిసింది.





ఆస్పత్రిలో పేరుకుపోయిన వ్యర్థాలు



రోడ్డు పక్కన పడి ఉన్న వ్యర్థాలు

అంతా ఆగమాగం..!

అధ్వానంగా తయారైన పెద్దాస్పత్రి
- పారిశుద్ధ్య కార్మికుల సమ్మెతో కంపుకొడుతున్న ఆవరణ
- జీతాలు చెల్లించే వరకూ విధులకు నిరాకరణ
- మున్సిపల్ కార్మికులను అడ్డుకున్న వైనం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులు సమ్మెకు దిగడంతో ఆస్పత్రి ఆవరణమంతా కంపుమయంగా తయారైంది. పెండింగ్ వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో కార్మికులు నిరవధిక సమ్మెకు దిగడంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయింది. పేషంట్ కేర్, సెక్యూరిటీ, స్వీపర్లు రెండో రోజు బుధవారం కూడా విధులు బహిష్కరించడంతో ఆస్పత్రి పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. టాయిలెట్లు శుభ్రం చేయకపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఇన్‌పేషంట్ రోగులు టాయిలెట్లలోకి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. వార్డులు, ల్యాబ్‌ల్లో చెత్త పేరుకుపోయింది. మెడికల్ వేస్ట్, చెత్తను తొలగించే వారు లేకపోవడంతో తీవ్రమైన వాసన వ్యాపిస్తోంది.

జీతాలు చెల్లించేదాక..

కాగా కార్మికులు తమకు పెండింగ్ వేతనాలు చెల్లించే వరకూ విధుల్లో చేరే ప్రసక్తే లేదని భీష్మించుకుర్చున్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ అతి త్వరలో జీతాలు చెల్లిస్తామని, హైదరాబాద్ నుంచి రెండు, మూడు రోజుల్లో క్లియరెన్స్ వస్తుందని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా కార్మికులు వినలేదు. మూడు నెలలుగా జీతాలు లేక అల్లాడిపోతున్నామని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని, అందరూ దసరా పండుగ చేసుకుంటుంటే తాము మాత్రం పస్తులు ఉండాలా? అని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

మున్సిపల్ కార్మికులతో వాగ్వాదం..

అయితే కార్మికుల సమ్మె విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆస్పత్రి శుభ్రం చేయడానికి మధ్యాహ్నం 10 మంది మున్సిపల్ కార్మికులను పంపించారు. అయితే ఆస్పత్రి కార్మికులు శుభ్రం చేసేందుకు వెళ్లనివ్వకుండా మున్సిపల్ కార్మికులను అడ్డుకున్నారు. జీతాలు లేక అల్లాడుతుంటే తమకు వ్యతిరేకంగా ఎలా పనిచేస్తారని వారితో వాగ్వాదానికి దిగారు. పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దడంతో వారు ప్రవేశ ద్వారం వద్దనే ఉండిపోయారు.



ఆస్పత్రి ప్రవేశ ద్వారం వద్ద మున్సిపల్ కార్మికులు

డిప్యూటీ సీఎంకు వినతులు

☞ బదిలీల ప్రక్రియపై నిర్ణయం తీసుకోవాలి

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖ(టీజీఎన్పీడీసీఎల్)లో నిలిపివేసిన బదిలీల ప్రక్రియపై నిర్ణయం తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్కకు ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(327) వినతి పత్రం అందించారు. మంగళవారం ఖమ్మంలో మంత్రిని యూనియన్ ప్రతినిధులు కలిసి బదిలీల ప్రక్రియ, కార్మికుల, ఉద్యోగుల సమస్యలపై వివరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగాల శ్రీధర్ మాట్లాడుతూ.. ఆర్టిజన్ కార్మికులకు గ్రేట్ చేంజ్ ప్రమోషన్లు ఇవ్వాలని, అన్‌మ్యాన్డ్ కార్మికులకు స్కేలు వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందపాటి సత్యనారాయణరెడ్డి, వి.సీతారాం గోపాల్, రవికుమార్, సత్యనారాయణ, నాగేంద్రకుమార్, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంవ్యవసాయం: భట్టికి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ ప్రతినిధులు

☞ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ఖమ్మంక్రైం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పోలీస్ సిబ్బందికి గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న టీఏలు, డీఏలు, సరెండర్ లీవ్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన మంగళవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంకు భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మెమెంటోను అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పోలీసు అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాసరావు, ఎస్‌బీసీఐ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ ఏసోబు, జాయింట్ సెక్రెటరీ జానీమియా, ట్రెజరర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నియామకాలు

☞ ఖమ్మం మామిళ్లగూడెం: పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్ తెలంగాణ ఈసీ మెంబర్‌గా ఖమ్మానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు షేక్ అబ్దుల్ రెహమాన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ వ్యవస్థాపకుడు, చైర్మన్ డి.మాధవరావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ.. సంస్థ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు.

☞ తిరుమలాయపాలెం: తిరుమలయపాలెం మండలం ఎంఆర్సీలో మెసేంజర్‌గా గత ఇరవై ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న చీమ ఉపేందర్ తెలంగాణ ఎంఆర్సీ మెసేంజర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ ఉప్పల్‌లోని ఆ సంఘ కార్యాలయంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరు యాదగిరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రగిరి, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

☞ ఖమ్మం సహకారనగర్: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా రాయల నర్సింహారావు ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో తన నియామకం జరిగినట్లు మంగళవారం నర్సాంహారావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నర్సింహారావును పలువురు అభినందించారు.



రాయల నర్సింహారావు

అధికారులకు సమయపాలన అక్కర్లేదా..?

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో అధికారుల సమయపాలన, విధుల పట్ల వారి నిబద్ధతపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికుల నుంచి ఇతర సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు పెట్టి వారి సమయపాలన నమోదు చేస్తున్న అధికారులు, ఉన్నతాధికారుల సమయపాలనను మాత్రం గాలికొదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కేఎంసీలో కీలక విభాగం అయిన వ్యయ పరిశీలన విభాగంలో అధికారులు స్థానికంగా ఉండకపోవడమే కాక.. ఇతర ప్రాంతాల నుంచి ఖమ్మానికి వచ్చి వెళ్తుండడంతో వారు కార్యాలయానికి వచ్చే సమయం ఎవరికి అంతుపట్టని విధంగా ఉంది. మధ్యాహ్నం 12 గంటల తర్వాతనే ఎప్పుడొస్తారో తెలియక కాంట్రాక్టర్లు సంతకాల కోసం కేఎంసీ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. మంగళవారం కొందరు పనిపై ఆ విభాగం అధికారుల గదుల వద్దకు వెళ్లగా.. ఎగ్జామినర్ సెలవులో ఉన్నారని, అసిస్టెంట్ ఎగ్జామినర్ విధుల్లో ఉన్నా.. ఎక్కడున్నారో తెలియని పరిస్థితి. వరంగల్ నుంచి వస్తున్న అధికారి మధ్యాహ్నం 12 గంటలకు కార్యాలయానికి వచ్చి సాయంత్రం 4 గంటలకే వెళ్తున్నాడన్న ఆరోపణలు చేస్తున్నారు. ఈ అధికారుల వలన తమ ఫైళ్లు నిలిచిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు.



మధ్యాహ్నం ఒంటి గంటకు ఖాళీగా ఉన్న కుర్చీ

నూతన పద్ధతులు అలవర్చుకోండి

ఖమ్మంరూరల్: గిరిజన సంక్షేమ శాఖ అధీనంలోని పాఠశాలలు, వసతి గృహాలు, పీఎంహెచ్ హాస్టల్ వంటి సిబ్బంది వ్యక్తిగత ఆరోగ్యం, పారిశుద్ధ్యం పాటించి నూతన పద్ధతులను అలవర్చుకోవాలని డీడీ ఎస్.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో హాస్టల్ వార్డెన్లు, డిప్యూటీ వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులకు హాస్టల్ నిర్వహణ నూతన పద్ధతులలో వంటల తయారీ, పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. నిబంధనల ప్రకారం మెనూ పాటించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ జహీరుద్దీన్, సత్యవతి, రాంబాబు, శ్యామ్, ప్రసాద్, రామకుమారి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు..

బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఏడవ రోజు మంగళవారం వేపకాయల బతుకమ్మలను మహిళలు కనులపండువగా నిర్వహించారు. ఈసందర్భంగా సంప్రదాయ పద్ధతుల్లో బతుకమ్మ పాటలు, కోలాటాలు, నృత్యాలతో మహిళలు సందడి చేశారు. అనంతరం వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. – సాక్షి నెట్‌వర్క్



తిరుమలాయపాలెం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..



ఖమ్మం: తెలంగాణ సాంస్కృతిక కేంద్రం, బీకే, జేవీకే ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



ఖమ్మంగాంధీచౌక్: విజయనగర్ కాలనీలో బతుకమ్మల వద్ద మహిళలు



కామేపల్లి పీహెచ్‌సీలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న వైద్య సిబ్బంది


నేత్రపర్వంగా నవరాత్రోత్సవాలు

శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం అమ్మవారిని ఉత్సవ కమిటీల బాధ్యులు వివిధ రూపాల్లో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు దర్శించుకుని పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలు మండపాలు, ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్





ఖమ్మంగాంధీచౌక్: మహాలక్ష్మీదేవి, శ్రీ విజయలక్ష్మి అలంకరణలో అమ్మవారు



కూసుమంచి: నర్సింహులగూడెంలో రూ.2 లక్షల కరెన్సీతో అమ్మవారి అలంకరణ



ఖమ్మంరూరల్: గొల్లగూడెంలో అన్నదానం..



నేలకొండపల్లి: శ్రీ ఉత్తరేశ్వరస్వామి ఆలయంలో..

కుటుంబ కార్డుతో అందరికీ సంక్షేమం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: ఒక్క కుటుంబ కార్డు ద్వారా అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయబడతాయని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెం మండలంలోని జల్లేపల్లిలో రూ.20 లక్షల ఎంజీఎన్ఆర్‌జీఎస్ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. అక్టోబర్ నెలాఖరు నాటికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, పైలెట్ ప్రాజెక్టు కింద కుటుంబ కార్డు సర్వే జరుగుతుందని, దీని ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. త్వరలోనే అర్హులందరికీ రుణమాఫీ సొమ్ము జమ చేస్తామని అన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతీ జీపీకి పంచాయతీ భవనం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో స్థానిక యువత కోసం ఒక రీడింగ్ రూమ్‌గా ఏర్పాటు చేసుకుంటే దానికి అవసరమైన పుస్తకాలు, ఇతర సహకారం జిల్లా యంత్రాంగం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ గణేష్, మండల తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీఓ సిలార్ సాహెబు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనాలని వేడుకోలు..

తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీకి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి రాకాసితండా వాసులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. 'సాక్షి'లో వచ్చిన 80 ధాన్యం బస్తాలు తడిసి ఇబ్బందులు పడుతున్న కథనాన్ని మంత్రికి చూపించి 'మీరు ధాన్యం కొనాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు రైతులు వేడుకొనగా.. వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ధాన్యం కొనేలా చూడాలని పీఏను ఆదేశించారు.



తిరుమలాయపాలెం: జల్లేపల్లి జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఆగ్రహం..

మండలంలోని కాకరవాయి తదితర గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు రావడంలేదని ఆయా గ్రామాల ప్రజలు మంత్రి దృష్టికి తీసుకురాగా వరదలు వచ్చి నెల రోజులు దాటినా ఏం చేస్తున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నెందుకు సస్పెండ్ చేయకూడదు... తమాషాలు చేస్తున్నారా! 48 గంటల్లో తాగునీరు సరఫరా చేయాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చెక్కుల పంపిణీ..

కూసుమంచి: కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన 124 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురామ్‌రెడ్డి పంపిణీ చేశారు. అలాగే ఖమ్మంరూరల్ మండలం, వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన చిట్యాల లక్ష్మి అనే విద్యార్థిని ఉచిత ఎంబీబీఎస్ సీటు పొందగా.. ఆమెను క్యాంపు కార్యాలయంలో మంత్రి అభినందించారు.

సంక్షిప్త సమాచారం

☞ రాష్ట్రస్థాయి టీటీ టోర్నీకి ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–19 పాఠశాలల క్రీడల్లో భాగంగా టేబుల్ టెన్నిస్ రాష్ట్ర జట్టుకు ఖమ్మం గోర్కి స్కూల్‌కు చెందిన పిట్టల మోహిత్‌కృష్ణ ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచిన మోహిత్ కృష్ణ లడక్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. జిల్లా నుంచి ఎంపిక కావడం పట్ల డీవైఎస్ఓ టి.సునీల్ కుమార్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.గోర్కి, జిల్లా సంఘం అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్, కార్యదర్శి వి.వి.ఎస్. మూర్తి, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, బాధ్యులు జంగాల సునీల్‌కుమార్, ఉపేందర్, రాంచందర్, చలపతిరావు, శృతి, తదితరులు అభినందించారు.

☞ రుణమాఫీ రైతులకు తిరిగి రుణాలు

రఘునాథపాలెం: రుణమాఫీ జరిగిన రైతులకు రుణ పరిమితి పెంచి ఇవ్వడంతో పాటు కొత్త రైతులకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు వీవీపాలెం సహకార సంఘం చైర్మన్ రావూరి సైదబాబు పేర్కొన్నారు. మంగళవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ రావేళ్ల శ్రీనివాసరావుతో కలిసి వివరాలు వెల్లడించారు. బంగారం తాకట్టుపై రుణాలు పెద్ద ఎత్తున ఇస్తున్నట్లు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సొసైటీ సీఈఓ ఐతగాని తిరుపతిరావు, సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

☞ టీఎన్జీవో నూతన కమిటీ ఎన్నిక

నేలకొండపల్లి: టీఎన్జీవో నేలకొండపల్లి యూనిట్ కమిటీ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. యూనిట్ అధ్యక్షుడిగా బుసాని అవినాష్‌యాదవ్, కార్యదర్శిగా అల్లం రవికుమార్, కోశాధికారిగా చలపతిరావులతో పాటు 12 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, సంఘం ఉన్నతి కోసం పాటుపడతామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి బి.నాగేశ్వరరావు, జిల్లా కో–కన్వీనర్ కొణిదేన శ్రీనివాస్, సభ్యులు డీఎస్.జయపాల్, విజయ్‌కుమార్, కొమరగిరి దుర్గాప్రసాద్, లలిత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

☞ ఎంపీ పరామర్శ

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంవన్‌టౌన్: ఇటీవల గుండె సమస్యలతో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహ్మద్ సలాంను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఖమ్మంలో సలాం నివాసానికి వెళ్లిన ఎంపీ ఆయనతో మాట్లాడి ఆరోగ్య స్థితిని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి శాఖ చైర్మన్ మువ్వా విజయబాబు, కొప్పుల చంద్రశేఖర్, నూనె శశిధర్, సాంబశివరెడ్డి, జ్వాలా నర్సింహారావు, ఎండీ మజిద్, యాకూబ్ జానీ, ఖాసీం పాషా, తదితరులు పాల్గొన్నారు.

☞ వర్గీకరణ హామీని అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆనందరావు

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణ హామీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ పాలేరు ఇన్‌చార్జ్, ఎమ్మార్పీఎస్ జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు వంగూరి ఆనందరావు డిమాండ్ చేశారు. మంగళవారం తిరుమలాయపాలెం, నేలకొండపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 1న ఎస్సీ, ఎస్టీల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అన్ని రాష్ట్రాల కంటే ముందుగా తానే అమలు చేస్తానని చెప్పి మాట తప్పారన్నారు. దీనికి నిరసనగా బుధవారం 9న ఖమ్మంలో జరిగే నిరసన ప్రదర్శనను ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి చింతిరాల నాగభూషణం మాదిగ మండల ఇన్‌చార్జ్ పగిడిపల్లి బాబు నాయకులు గంటా కృష్ణ, పోలేపొంగు వెంకటేశ్వర్లు, రామ్ గోపాల్, గుగ్గిళ్ళ అశోక్, పి.ఈదయ్య, బాలస్వామి, వెంకన్న, రాయబారపు గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

☞ సీఎండీని కలిసిన యూఈఈయూ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో బదిలీలపై సీఐటీయూ అనుబంధ టీజీ యూఈఈయూ (యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్) ప్రతినిధి వర్గం మంగళవారం ఖమ్మంలో టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని కలిసి ఉద్యోగులు, కార్మికులు సమస్యలను వివరించారు. దీంతో సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని సీఎండీ హామీ ఇచ్చినట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు. యూనియన్ కంపెనీ కార్యదర్శి ఎం.ప్రసాద్, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పుష్పరాణి, కామినేని నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

☞ బీజేపీ నాయకుల సంబరాలు

ఖమ్మం మామిళ్లగూడెం/కూసుమంచి: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా మంగళవారం ఖమ్మంలో పాటు కూసుమంచి తదితర మండలాల్లో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాణా సంచాలు కాల్చుతూ మిఠాయిలు పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఖమ్మంలో బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేయగా.. బీజేపీ నేత తాండ్ర వినోద్‌రావు, కూసుమంచిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ మాట్లాడుతూ.. హరియాణా ప్రజలు బీజేపీకి మద్దతు తెలపడం దేశ వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తల్లో నూతన ఉత్తేజం నింపిందన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, రవి రాథోడ్, బెల్లం మురళి, గుండా ఉపేందర్‌రెడ్డి, నరేష్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

☞ పేద ప్రజలకు అండగా సీపీఎం

ఖమ్మం మామిళ్లగూడెం: పేద ప్రజలకు అండగా సీపీఎం ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఖమ్మం బోడెపుడి విజ్ఞాన కేంద్రం వర్కర్స్ శాఖ మహా సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఆకలి, దుర్భర దారిద్రం, పేదరికం ఒక పక్క పెరుగుతుంటే అంబానీ, అదానీలకు కోట్ల రూపాయలు ఆర్థిక సాయం ప్రభుత్వం చేస్తుందని మండి పడ్డారు. ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడం వలన దేశం విచ్ఛిన్నం అయ్యే అవకాశముందని, పార్టీ నిర్వహించే ఆందోళన, పోరాటాలకు జిల్లా కేంద్రంలో ఉన్న పార్టీ సభ్యులు పాల్గొనాలని కోరారు. నూతన శాఖ కార్యదర్శులుగా రమేష్, రాధాకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సభలో జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, ఆర్.ప్రకాశ్, సభ్యులు నవీన్, శ్రీనివాస్, నాగేశ్వరావు, లింగయ్య, కృష్ణమూర్తి, వెంకటమ్మ, కోటేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.